# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 03-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- దివ్యాంగులకు అవరోధ రహిత సమాజాన్ని అందివ్వడం మానవాళి కర్తవ్యమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- నూతన నేర చట్టాలు వలస వారసత్వం నుండి భారత్ కు విముక్తి కలిగిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యాచించారు.
- భారత్ చైనాల మధ్య సరిహద్దుల్లో శాంతి స్థాపన ఆవశ్యకమని కేంద్రమంత్రి ఎస్. జైశంకర్ ఉద్ఘాటించారు.
- మహిళల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవి స్పష్టం చేశారు.

====================

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు న్యూఢిల్లీలో జాతీయ పురస్కారాలను ప్రధానం చేశారు. దివ్యాంగుల సాధికారత కోసం కృషి చేసినందుకు గాను 33 మంది ఆదర్శప్రాయమైన వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... ఈ పురస్కార గ్రహీతలు సమాజంలో ఆదర్శంగా నిలుస్తారన్నారు. దివ్యాంగులకు నైపుణ్యాలను పెంపొందించడం, ఉపాధి కల్పించడం, కొనుగోలులో వారి ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వడం, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం వంటి చర్యల ద్వారా వారిలో నాయకత్వ సామర్థ్యాలను ప్రోత్సహించవచ్చన్నారు. దివ్యాంగులకు సార్వత్రిక సౌలభ్యాన్ని అందించడంలో సుగమ్య భారత్ అభియాన్ పాత్ర కీలకమైనదని వ్యాఖ్యానించారు. దివ్యాంగులకు అవరోధ రహిత సమాజాన్ని అందించడం మానవాళి కర్తవ్యమని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

====================

భారత్ - చైనాల మధ్య సరిహద్దు ప్రాంతాల్లో శాంతి స్థాపన ఆవశ్యకమని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ ఉద్ఘాటించారు. చైనా చర్యల కారణంగా సరిహద్దు ప్రాంతాలలో శాంతికి భంగం వాటిల్లిందని, 2020 సంవత్సరం నుండి భారత్ - చైనాల మధ్య సంబంధాలు అసాధారణంగా ఉన్నాయన్నారు. 2020 ఏప్రిల్ - మే నెలల్లో తూర్పు లడఖ్‌లోని వాస్తవ నియంత్రణ రేఖ వెంబడి చైనా పెద్ద సంఖ్యలో సైనికులను మోహరించడం వల్ల అనేక కేంద్రాల వద్ద ఎదురు కాల్పుల ఘటనలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. పెట్రోలింగ్ కార్యకలాపాలకు కూడా అంతరాయం ఏర్పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. అనేక సవాళ్ళను అధిగమించి, భారత సాయుధ దళాలు అప్పటి పరిస్థితులను సమర్థవంతంగా ప్రతిఘటించగలిగాయని చెప్పారు. సరిహద్దుల్లో శాంతి స్థాపనకు రాబోయే రోజుల్లో ఇరు దేశాల మధ్య చర్చలు జరుగుతాయని జైశంకర్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

నూతన నేర చట్టాలు భారత్ కు వలస వారసత్వం నుండి విముక్తి కలిగిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈరోజు చండీఘర్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో కలిసి నూతన నేర చట్టాల విజయవంతమైన అమలును నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భారత రాజ్యాంగం దేశ పౌరులకు కల్పించిన హక్కులను అందజేయడానికి నూతన నేర చట్టాలు దోహదపడతాయన్నారు. చండీగఢ్‌లో ఈ నేర చట్టాలను విజయవంతంగా అమలు చేసినందుకు పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయవాదులకు, ధన్యవాదాలు తెలిపారు.

(వాయిస్ 37 సెకన్లు)

అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ... మూడు కొత్త నేర చట్టాలు “భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం”లను 3 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. ఈ చట్టాలను భారత ప్రజలకు న్యాయం చేసేందుకు పార్లమెంటులో భారత పౌరులు రూపొందించారని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉందని కేంద్ర మహిళా శిశు సంక్షేమాభివృద్ధి శాఖా మంత్రి అన్నపూర్ణా దేవి అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు ఆమె విలేఖరులతో మాట్లాడుతూ, మహిళలకు అన్ని రంగాల్లో నాయకత్వ అవకాశాలను కల్పిస్తూ.. మహిళల నేతృత్వంలో అభివృద్ధిని సాధించడమే ప్రధానమంత్రి ధ్యేయమని తెలిపారు. బాలికల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇటీవల నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖతో ఒక ఒప్పందం కుదుర్చుకుందని ఆమె తెలిపారు. నమో డ్రోన్ దీదీ, లక్ పతి దీదీ వంటి కార్యక్రమాలు గ్రామీణ మహిళలకు స్వావలంబన కలిగిస్తున్నాయని, కుటుంబాల్లోను, సమాజంలోను వారికి గౌరవాన్ని తీసుకువస్తున్నాయని పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను దాదాపు మూడు రెట్లు పెంచిందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో బియ్యం క్వింటాల్‌కు ఒక వెయ్యి 310 రూపాయలు ఉండగా, ఇప్పుడు క్వింటాల్ కు 2 వేల 300 రూపాయలకు పెంచామన్నారు. అలాగే... జొన్నలు క్వింటాల్‌కు 1500 రూపాయలు ఉండగా, ప్రస్తుతం క్వింటాల్‌కు 3 వేల 371 రూపాయలకు పెంచామని వివరించారు. బజ్రా 1,250 రూపాయల నుండి 2 వేల 625 రూపాయలకు, రాగులు 1500 రూపాయల నుండి 4 వేల 269 రూపాయలకు పెంచినట్లు కేంద్ర మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

దివ్యాంగులకు అన్ని విధాలుగా అవకాశాలను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. సుగమ్య భారత్ అభియాన్‌కు 9 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సామాజిక మాధ్యమంలో ఒక ప్రకటన చేస్తూ... పారాలింపిక్స్‌లో భారతదేశం సాధించిన విజయాన్ని ప్రస్తావించారు. దివ్యాంగ సోదర, సోదరీమణుల విజయాలు యావత్ దేశం గర్వించేలా చేశాయన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోఎందని కేంద్ర జౌళి శాఖా మంత్రి గిరిజ్ సింగ్ పేర్కొన్నారు. లోక్ సభలో ఈరోజు ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ... చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందజేస్తోందని, జాతీయ చేనేత కమీషన్ ఏర్పాటు చేసే యోచన లేదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 26 లక్షల మంది నేత కార్మికులు ఉండగా వారిలో 72 శాతం మంది మహిళల లే అని వెల్లడించారు. చేనేత కార్మికుల కోసం చిన్న క్లస్టర్ల అభివృద్ధి కార్యక్రమం, చేనేత మార్కెటింగ్ సహాయం, మెగా క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం, చేనేత కార్మికుల సంక్షేమం వంటి అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని కేంద్రమంత్రి వివరిస్తూ....

(వాయిస్ 24సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

భోపాల్ విషవాయువు దుర్ఘటన జరిగి 40 సంవత్సరాలైన సందర్భంగా ఈరోజు సర్వమత ప్రార్థనలు సహా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మధ్యప్రదేశ్ గవర్నర్ మంగుభాయ్ పటేల్ సర్వమత ప్రార్థనలలో పాల్గొని... నాటి దుర్ఘటనలో మరణించిన వారికి నివాళులు అర్పించారు. కాగా... కేంద్ర ప్రభుత్వం... ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్యక్రమం ద్వారా భోపాల్ విషవాయు బాధితులకు సహాయం అందించే దిశగా చర్యలు ప్రారంభించింది. ప్రధానమంత్రి ఆదేశాల మేరకు భోపాల్ గ్యాస్ బాధితులకు, వారి పిల్లలకు ఆయుష్మాన్ భారత్ కార్డులను సిద్ధం చేసి, నవంబర్ పూర్తయ్యే సరికి 20 వేల మందికి అందజేశారు. వీటి ఫలితంగా బాధితులు వివిధ ఆసుపత్రులలో ఉచితంగా చికిత్స పొందుతున్నారు. అలాగే.. 4 వేల మందికి పైగా బాధిత వితంతువులకు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛనుతో పాటు, భోపాల్ గ్యాస్ రిలీఫ్ డిపార్ట్‌మెంట్ నుండి ఒక వెయ్యి రూపాయల అదనపు పింఛను అందిస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (MNREGA) పథకానికి గత 10 సంవత్సరాల్లో ఎన్డీయే ప్రభుత్వ హయాంలో నిధుల కేటాయింపు గణనీయంగా పెరిగిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ తెలిపారు. ఈరోజు లోక్‌సభలో ఒక అనుబంధ ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, MNREGA పథకానికి ప్రభుత్వం ఈ సంవత్సరం 87 వేల కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయింపులు జరిగాయని, 2013 - 14 సంవత్సరాల మధ్య ఈ మొత్తం 33 వేల కోట్ల రూపాయలుగా ఉండేదని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = =

పారా అథ్లెటిక్స్‌తో సహా 21 క్రీడలకు సంబంధించి 2 వేల 781 మంది క్రీడాకారులను ఖేలో ఇండియా పథకం కింద గుర్తించామని కేంద్ర క్రీడల శాఖా మంత్రి మన్సుఖ్ మాండవియా తెలిపారు. లోక్‌సభలో సభ్యులు అడిగిన ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానం ఇస్తూ.... ఖేలో ఇండియా టాలెంట్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా వారికి అవసరమైన సహాయాన్ని అందజేస్తున్నామన్నారు. నిర్దిష్ట మార్గదర్శకాలు, ప్రమాణాల ఆధారంగా అథ్లెట్లలో ప్రతిభను గుర్తించి, ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

కేరళ, ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, లక్షద్వీప్, కోస్టల్, సౌత్ కర్ణాటకలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =